30 పైబడిందా.. జాగ్రత్త!

- 35 సంవత్సరాలు దాటిన వారికి అసంక్రమిత వ్యాధులు
- స్క్రీనింగ్ పరీక్షల్లో వెల్లడి
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల వ్యాధులు నిర్దీత వయస్సు కంటే ముందస్తుగానే ప్రజలపై దాడిచేస్తున్నాయి. వాతావరణ కాలుష్యం, ఆహార కాలుష్యం, నీటి కాలుష్యం, ధ్వని కాలుష్యం, వాయువు కాలుష్యం, ఒత్తిడితో కూడిన జీవితం ప్రజలు గడుపుతుండటం వల్ల చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడడంపై వైద్య నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 30 ఏళ్ల దాటిన ప్రజలందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అసంక్రమిత వ్యాధుల బారిన పడినట్లు నిర్ధారణ జరిగింది. ప్రజలు వ్యాధుల బారినపడకుండా కొద్దిపాటి అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

సర్వే జరిగిందిలా..

ఎన్‌సీడీ కార్యక్రమం గుంటూరు జిల్లాలో 2016లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా 2021 డిసెంబరు నుంచి 2022 డిసెంబరు వరకు ఏఎన్ఎంలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 30 సంవత్సరాలు దాటిన వారు 19,73,456 మంది ఉన్నారు. వీరిలో 14,89,455 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయిన వారిలో 1,00,652 మంది అధిక రక్తపోటు (బీపీ)తో, 88,745 మంది మధుమేహంతో (షుగర్) బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. షుగర్, బీపీతో బాధపడుతున్నవారు 49,705 మంది ఉన్నారు. అధిక రక్తపోటు, షుగర్ వ్యాధితో పాటు, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, టీబీ, మలేరియా, లెప్రసీ, హిమోగ్లోబిన్ శాతం, బరువు, ఎత్తు పరీక్షలను సైతం చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించారు. ఉచితంగా మందులు అందించారు. మెరుగైన వైద్య సేవల కోసం సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేశారు.

హైరిస్క్ వారు జాగ్రత్తగా ఉండాలి



బీపీ, షుగర్ ఉన్నవాళ్ళు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. షుగర్ సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడవుతాయి. ఊబకాయం (అధికబరువు) ఉన్నవారు సైతం కిడ్నీ జబ్బున పడే ప్రమాదం ఉంది. జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల నేడు 20 ఏళ్ళు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ జబ్బు బారిన పడుతున్నారు. షుగర్, అధికరక్తపోటు, ఊబకాయం దీనికి కారణం. బీపీ షుగర్ ఉన్నవాళ్ళు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ చింతా రామకృష్ణ,
సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు.

జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ దరికి రాదు



షుగర్‌వ్యాధి ఉందా లేదా అని ముందస్తుగా తెలుసుకోవటానికి హెచ్‌బీఎ1సి పరీక్ష చేయించుకుంటే తెలుస్తుంది. రక్తంలో షుగర్‌శాతాన్ని బట్టి వ్యాధి ఉందా లేదా నిర్ధారణ చేస్తారు. ఉదయాన్నే పరగడుపున ఏమీ తినకుండా, తాగకుండా షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించినప్పుడు రక్తంలో షుగర్ 126లోపు ఉంటే షుగర్ వ్యాధి లేనట్లే. క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ జీవన శైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా షుగర్ అదుపులో ఉంటుంది.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి,
జనరల్ ఫిజీషియన్, గుంటూరు

క్యాన్సర్ రాకుండా...



కొన్ని రకాల క్యాన్సర్‌లు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు సైతం నేడు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించే ఆధునిక వైద్యసేవలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. తాజా కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారం తీసుకునేవారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. ప్రతిరోజూ కనీసం అరగంటసేపు శారీరక వ్యాయామం చేయాలి. దురలవాట్లకు దూరండా ఉండాలి.

– డాక్టర్ ఎం.జి. నాగకిషోర్,
సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 23వ డివిజన్లో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నగరంపాలెం: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 23వ డివిజన్ 83వ సచివాలయ పరిధిలోని కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుక్‌లెట్లను అందించారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.14.08 లక్షల లబ్ధి పొందినట్లు రమాదేవి తెలియజేయగా, రూ.10.43 లక్షల వరకు లబ్ధిపొందినట్లు మరో స్థానికురాలు ముంతాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగనన్నను ప్రజలందరూ ఆశీర్వదించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతిరోజు ఆయా డివిజన్లు, గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత 150 రోజులకు పైగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో పలు సమస్యలను తీర్చినట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన, చైతన్యం తీసుకొస్తామని అన్నారు. దీనిలో భాగంగా చివరి లబ్ధిదారుని వరకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనేది వారి నుంచి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇంటి స్థలాల పంపిణీ మొదలుకుని గడిచిన మూడున్నరేళ్లల్లో అనేక సంక్షేమ ఫలాలు, అభివృద్ధి చేశామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి మంచి పనులు చేపట్టామని పేర్కొన్నారు. చివరి లబ్ధిదారునికి కూడా పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని వారి నుంచే తెలుసుకున్నారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ సాదు ఉమామహేశ్వరీ–రాజేష్, డివిజన్ అధ్యక్షుడు లూథర్‌బాబు సంజయ్, అస్గర్‌అలీ, కరణం రాము, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు

క్రైం, ట్రాఫిక్ విభాగ అదనపు ఎస్పీ ఎ. శ్రీనివాసరావు



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న క్రైం, ట్రాఫిక్ విభాగ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: మైనర్లకు వాహనాలను ఇవ్వడం ద్వారా జరిగే పరిణామాలకు వారి తల్లిదండ్రులనే బాధ్యులుగా చేస్తామని క్రైం, ట్రాఫిక్ విభాగ అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసరావు హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండే వరకు విద్యార్థినీ, విద్యార్థులు వాహనాలు నడపరాదని, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే అందుకు విద్యార్థుల తల్లిదండ్రులను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ విభాగాల ట్రాఫిక్ సీఐలు షేక్ నిస్సార్ బాషా, ఎం.శేషగిరిరావు, ట్రాఫిక్ ఎస్సై షేక్ మౌలానా షరీఫ్, శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి, సేవాతత్పరతకు మారుపేరు నేతాజీ



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

లక్ష్మీపురం: జైహింద్ అనే నినాదంతో భారతీయులందరినీ ఏకం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రమశిక్షణ దేశ భక్తి, సేవాతత్పరతలకు మారుపేరని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక కొత్తపేటలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో సుభాష్ చంద్రబోస్ ఒక అసాధారణ వ్యక్తిగా వెలుగొందారని గుర్తు చేశారు. ఆయన ఆచరణలో చూపించిన ధైర్యం, సాధించిన విజయాలు 20వ శతాబ్దపు భారత దేశ ముఖ చిత్రంపై ఆయనను అపూర్వ వ్యక్తిగా ఆవిష్కరిస్తాయన్నారు. భారత దేశపు సరిహద్దులను దాటి తన ఎత్తుగడలతో బ్రిటీష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించిన యోధుడన్నారు. అనంతరం అవగాహన సంస్థ యోగా కేంద్రం అధ్యక్షుడు అచ్యుత ఇందు శేఖర్, ఎ.పి లాయర్ల ఫోరం కన్వీనర్ ఎ.హరి, సంస్థ సభ్యులు ఘన నివాళులర్పించారు.

మరణం లేని దేశభక్తుడు నేతాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: జననమే తప్ప మరణం ఎరుగని గొప్ప దేశభక్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశంలో ఆర్మీని నెలకొల్పి దేశ రక్షణలో కీలకపాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి నేతాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

తాడేపల్లిరూరల్ : జగనన్న కాలనీల్లో వసతులు కల్పించాలని దుగ్గిరాల మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిలువూరు, ఈమని గ్రామాల్లోని సచివాల కార్యదర్శులకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కాలనీల్లో పరిస్థితులను వివరించారు.

కౌన్సిల్ మెంబర్‌గా నేతాజీ



పాతగుంటూరు: సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వై.నేతాజీ సీఐటీయూ జాతీయ జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న బెంగళూరులో జరిగిన సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలో ఆయన్ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయన ఎన్నిక పట్ల సీఐటీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


కల్యాణ మండపానికి ఫోరం వడ్డింపు

పాత గుంటూరు: అనివార్య కారణాల వల్ల వివాహం వాయిదా పడితే కల్యాణ మండపానికి చెల్లించిన అడ్వాన్సును తిరిగి ఇచ్చేయని మండపం నిర్వాహకులకు రాష్ట్ర వినియోగదారుల ఫోరం చివాట్లు పెట్టింది. వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన గుమ్మడి సుబ్బారావు తన కుమార్తె వివాహం కోసం 2017 నవంబరు 30న రింగురోడ్డులోని ఒక కన్వెన్షన్ సెంటర్‌ను బుక్ చేశారు. అందుకు అడ్వాన్సుగా 18 వేలు, జీఎస్టీతో కలిపి రూ. 1,18,000 వేలు చెక్ కన్వెనన్స్‌కు ఇచ్చారు. అయితే 2018 ఏప్రిల్ 24 మంగళవారం వివాహ తేదీ అనుకూలంగా లేదని ఏప్రిల్ 18వ తేదీకి మార్చాలని సుబ్బారావు కోరారు. అలా ఇవ్వడం కుదరదని కన్వెన్షన్ నిర్వాహకులు చెప్పడంతో తాను ఇచ్చిన అడ్వాన్సు తిరిగి ఇచ్చేయాలని సుబ్బారావు కోరడంతో కన్వెన్షన్ నిర్వాహకులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో సుబ్బారావు తనకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయగా రూ. లక్షలో రూ. 85 వేలు సుబ్బారావుకు తిరిగి చెల్లించాలని ఫోరం తీర్పును వెలువరించింది. అయితే కన్వెన్షన్ సెంటర్ నిర్వాహకులు జీఎస్టీ రూ. 18 వేలు ప్రభుత్వానికి చెల్లించలేదంటూ విచారణ చేపట్టాలని సుబ్బారావు జీఎస్టీ ఇంటిలిజెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సుబ్బారావు సోమవారం ప్రకటనలో తెలిపారు.

చిన్నారి కుటుంబానికి ఆర్థికసాయం

పట్నంబజారు: పీకలవాగులో పడి ప్రమాదవశాత్తూ మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి చెక్కును గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెక్కును అందజేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. గత ఏడాది జూన్ 26వ తేదీన చుట్టుగుంట పీకలవాగు వద్ద ముంగి వెంకటేష్ (04) జారీ పడి సంపత్‌నగర్ కొబ్బరితోట వద్ద మృతి చెంది తేలాడు. ఈ ఘటనకు సంబంధించి రూ.4 లక్షల 50 వేల చెక్కును చిన్నారి తండ్రి పుల్లారావుకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి, వైఎస్సార్ సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



మంగళగిరి: గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఈనెల 22న జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో నగరంలోని అమరావతి తైక్వాండో క్లబ్ విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు కోచ్ పి.సుబ్బారావు సోమవారం తెలిపారు. క్యాడెట్ బాయ్స్ విభాగంలో బాలాజీశ్వర్, మోహినిష్, వర్షిత్‌కుమార్, అక్షిత్ కుమార్, లక్ష్మీ నరసింహ, బాలికల విభాగంలో తులసి, తేజశ్రీ, డింపుల్ భవానీ, గాయత్రి బంగారు పతకాలు సాధించినట్లు వెల్లడించారు. జూనియర్, సీనియర్ విభాగంలో వినోద్‌పాల్, హర్షవర్ధన్, హారిక, సౌజన్య బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఈనెల 29, 30, 31 తేదీల్లో అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సుబ్బారావు పేర్కొన్నారు.

క్లుప్తంగా

26న ట్రాక్టర్ల ర్యాలీ జయప్రదం చేయాలి

పాత గుంటూరు: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన సమావేశంలో అజయ్ కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి అక్రమంగా తీసుకువచ్చిన 3 వ్యవసాయ చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని పేర్కొన్నారు. రైతులు వేస్తున్న అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని అన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంజుల విఠల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ముప్పాళ్ల శివశంకరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు పాల్గొన్నారు.

సినిమా పోస్టర్ ఆవిష్కరణ



పాత గుంటూరు: గుంటూరు విద్యార్థి ధర్మ మహేష్ హీరోగా నటించిన ''సింధూరం'' సినిమా ప్రమోషన్లో భాగంగా సోమవారం బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో హీరో మిత్ర బృందం ఆధ్వర్యంలో సినిమా పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో హీరో ధర్మ మిత్రుడు ప్రవీణ్ నాయుడు మాట్లాడుతూ హీరో ధర్మ కళాశాల విద్య గుంటూరులో సాగిందని వివరించారు. తమ తోటి మిత్రుడు ధర్మ హీరోగా వస్తున్న తొలి సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ నెల 26వ తేదీన లైట్‌లైన్ స్టూడియోస్ బ్యానర్‌లో చిత్రం తెరకెక్కనుందని పేర్కొన్నారు. సమావేశంలో నూనె పవన్ తేజ, షేక్. కరీం, కల్యాణ్, సాయి, విజయ్‌కృష్ణ, రాజు, భార్గవ్, షరీఫ్, అశోక్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సహాయం

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఎండీఎం ఆటోస్టాండ్‌లో ఆటో నడుపుకునే ఏసయ్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న క్రమంలో రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని యూనియన్ తరుపున అందజేశారు. వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు నూరిఫాతిమా హాజరై ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాట్ల రవి, ఆటో యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు

పట్నంబజారు: నిబంధనలు అతిక్రమించి, సమయ వేళలు పాటించకుండా తెరిచిన బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓల్డ్‌క్లబ్ రోడ్డు చివర ఉండే కాలచక్ర బార్ అండ్ రెస్టారెంట్ ఆదివారం అర్ధరాత్రి సమయంలో సైతం తెరిచి ఉండటాన్ని గమనించిన కొత్తపేట ఎస్ఐ మధుపవన్ పరిశీలించారు. యజమానికి తెలియకుండా మహేష్ అనే బార్‌లో పనిచేసే వ్యక్తి అర్ధరాత్రి అమ్మకాలు చేపట్టినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఐదుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చైతన్యపురం కాలనీ సాయిబాబా దేవాలయం ప్రాంతంలోని ఓ నివాసంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 57 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి సమాచారం ఇవ్వరూ..

గుంటూరు ఈస్ట్: కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడి వివరాలు తెలియజేయాలని అరండల్‌పేట పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొరిటిపాడు నాయుడుపేటకు చెందిన గ్రంధి రవికుమార్ అలియాస్ ప్రసాద్, అలియాస్ అబ్దుల్ రెహమాన్ తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా నేరేచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఓ కేసులో నిందితుడు. అతను కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. కోర్టు న్యాయమూర్తి నేరస్తుడిగా పేర్కొంది. సమాచారం తెలిసిన వారు నేరేడుచర్ల పోలీసు అధికారి సెల్. 9440700085 నెంబరుకు సమాచారం తెలపాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం.. సంపత్‌నగర్ రామనామక్షేత్రం ప్రాంతానికి చెందిన మామిడి సుధీర్ కుమార్ (29) నల్లచెరువుకు చెందిన ఓ వివాహితతో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో తల్లితండ్రులు మందలించి, సాఫ్ట్‌వేర్ కోచింగ్ నిమిత్తం కొద్దికాలం హైదరాబాద్‌కు పంపారు. అయితే తిరిగి వచ్చిన సుధీర్‌కుమార్ వివాహిత నివాసానికి వెళ్లి ఉరి వేసుకుని మృతి చెందాడు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి వేదాద్రిశర్మ, తనకుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీసులు ఫిర్యాదు చేయగా, అనునాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గడువులోగా 'స్పందించండి'

- ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): 'ప్రజల నుంచి అందే సమస్యలు, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించండి... వాటిని పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని' నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలన్నారు. నోడల్ అధికారులు సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి సోమవారం నోడల్ అధికారులతో సచివాలయ పనితీరుపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ పాల్గొనాలన్నారు.

సోమవారం నిర్వహించిన స్పందనలో 60 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 12, ప్రజారోగ్య విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 7, ఉపాసెల్ విభాగానికి 3 చొప్పు ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, మేనేజర్ శివన్నారాయణ, ఏ.సి.పి.లు, ఆర్.ఓ.లు, ఈ.ఈ లు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రతిష్ట మహోత్సవాలు ఆరంభం



స్వామివారిని దర్శించుకున్న మేయర్ మనోహర్ నాయుడు

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి మందిరంలో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వేద పారాయణలు, యంత్ర పునఃశ్చరణలు, జీవన్యాస, జీవతత్వన్యాస, కళాన్యాసం, మేఘాన్యాస హోమాలు, గర్తన్యాసం, యంత్రస్థాపన, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మందిర సొసైటీ అధ్యక్షుడు కె.సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందర రామిరెడ్డి, సభ్యులు కల్లి శ్రీనివాసరెడ్డి, ఎం.ఆనంద్, టి.మస్తాన్‌రావు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో ఆత్మార్పణ మహోత్సవాలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న ఈఓ దుర్గారావు, మహిళలు

పాత గుంటూరు: స్థానిక ఆర్.అగ్రహారంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి అగ్నిప్రవేశ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని పంచామృతాభిషేకాలు, హోమం, గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో మాజేటి ప్రసాద్, గుడివాడ వెంకటేశ్వర్లు, టీఎల్‌వీ వీరాంజనేయులు, దేవరశెట్టి సత్యనారాయణ, తూనుగుంట్ల నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ పాదర్తి దుర్గారావు పర్యవేక్షించారు.

కేంద్రియ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: విద్యార్థుల్లోని దేశభక్తిని నింపేందుకు, సృజనాత్మక పెంపొందించేందుకు పోటీలు దోహదం చేస్తాయని నల్లపాడు కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ హనిమెహత తెలిపారు. పాఠశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవితంపై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు చిత్రలేఖనం పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని జయించేందుకు ఒక ప్రత్యేకమైన చొరవతో దేశవ్యాప్తంగా 500 విద్యాలయాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు.

ఈ పోటీలలో కేంద్రియ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సీబీఎస్ఈ విద్యాలయాలకు చెందిన 50 వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు వివరించారు. జిల్లాలోని స్టేట్ బోర్డ్, సీబీఎస్ఈ, కేంద్రియ విద్యాలయాలకు చెందిన 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. భారత ప్రభుత్వ విద్యాశాఖ సూచనల మేరకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షపై చర్చ 6.0 కార్యక్రమం జనవరి 27వ తేదీన ఉంటుందని తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, శ్రీదేవి, సునీల, మృత్యుంజయరావు, శ్రీరామ్ పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సుతో ఉజ్వల భవిష్యత్

ఘనంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఫ్రెషర్స్ డే



క్యాండిల్ లైట్ తో ప్రతిజ్ఞ చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

గుంటూరు మెడికల్: నర్సింగ్ కోర్సు అభ్యసించిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఉజ్వల భవిష్యత్ లభిస్తోందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కళావతమ్మ అన్నారు. సోమవారం గోరంట్లలోని ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే, లైట్ ల్యాంపింగ్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కళావతమ్మ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని, వృత్తిలోకి ప్రవేశించేవారు ఓర్పు, కరుణ, జాలి, దయ కలిగి ఉండి, రోగులకు ప్రేమతో సేవలందించాలన్నారు. దేశ, విదేశాల్లో బీఎస్సీ నర్సింగ్ అభ్యసించిన వారికి మంచి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లైట్ ల్యాంపింగ్ చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల బోధనా సిబ్బంది సుశీల, స్లీవమ్మ, పద్మావతి, త్రిపుర, శైలజ, జయ, శ్రీదేవి, అనిత, మల్లిక తదితరులు పాల్గొన్నారు.